నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | శనివారం 12 ఏప్రిల్ 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

సిర్పూర్(టీ)లో బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ కార్యకర్తలు

రజతోత్సవ వేడుకల పోస్టర్ల ఆవిష్కరణ

కౌటాల, ఏప్రిల్ 11 : ఈ నెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించనున్న బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకల వాల్ పోస్టర్‌ను శుక్రవారం సిర్పూర్(టీ) మండల కేంద్రంలో బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ రజతోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ సర్కారు వైఫల్యాలను ఎత్తిచూపుతూ.. కేసీఆర్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

విజయవంతం చేయండి

పెంచికల్‌పేట్, ఏప్రిల్ 11 : ఈ నెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించనున్న రజతోత్సవ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండల కన్వీనర్ బిట్టు శ్రీనివాస్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో చలో వరంగల్ పోస్టర్‌ను నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాబులాల్, వాసాల రాజవర్ధన్, తైదల రవి, పొట్టి గంగారాం, పాగిడే దేవదాస్, పున్నం తోగయ్య, తొడిషెం సుధాకర్, సిడెం సురేశ్ పాల్గొన్నారు.

పెంచికల్ పేట్ : రజతోత్సవ బహిరంగ సభ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

గ్యాస్ ధర తగ్గించాలి

● సీపీఎం శ్రేణుల డిమాండ్ ● మాల గురిజాలలో నిరసన

బెల్లంపల్లి, ఏప్రిల్ 11 : కేంద్రప్రభుత్వం వంట గ్యాస్ ధరను తగ్గించాలని సీపీఎం శ్రేణులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మాల గురిజాల గ్రామంలో ఖాళీ సిలిండర్లతో నిరసన వ్యక్తం చేశారు. ముఖ్య అతిథి, జిల్లా ఇన్‌చార్జి పైల ఆశయ్య మాట్లాడుతూ ప్రభుత్వం పెంచిన రూ. 50 గ్యాస్ ధరను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్రప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలకు స్వస్తి పలకాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సంకె రవి, ఏరియా కమిటీ సభ్యుడు చల్లూరి దేవదాస్, నాయకులు గొమాస లక్ష్మణ్, దుర్గం బాపు, చాపిడి నారాయణ, గుమాస శంకర్, ప్రసాద్, కిష్టయ్య, తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్లతో నిరసన తెలుపుతున్న సీపీఎం శ్రేణులు

పూలే ఆశయ సాధనకు కృషి చేయాలి

● ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

● జజ్జరవెల్లిలో పూలే దంపతుల విగ్రహాల ఆవిష్కరణ

జజ్జరవెల్లిలో మాట్లాడుతున్న ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి

కన్నెపల్లి, ఏప్రిల్ 11 : మహాత్మాజ్యోతిబా పూలే ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి పేర్కొన్నారు. పూలే జయంతి సందర్భంగా శుక్రవారం కన్నెపల్లి మండలం జజ్జరవెల్లి గ్రామంలో పూలే దంపతుల విగ్రహాలను ఆవిష్కరించారు. బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం పూలే దంపతులు ఎంతో కృషి చేశారని కొనియాడారు. ప్రభుత్వం పూలే దంపతులకు భారత రత్న ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాలీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చెండె సత్యనారాయణ, ఆసిఫాబాద్ మాజీ సర్పంచు మర్సుకోల సరస్వతి, పీఏసీఎస్ చైర్మన్ అహ్మద్, నాయకులు నారాయణ, శ్రీహరి, సునీత బానేశ్, రమేశ్, మాలీ కులస్తులు పాల్గొన్నారు. కన్నెపల్లి మండల కేంద్రంలో జ్యోతిబాపూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. బెల్లంపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింగరావు హాజరై పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాలీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, నాయకులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగోన్నతి మరింత బాధ్యత పెంచుతుంది

ఎస్సీ డీవీ శ్రీనివాసరావు

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, ఏప్రిల్ 11 : పదోన్నతి ఉత్సాహంతో పాటు మరింత బాధ్యత పెంచుతుందని ఎస్సీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం రామగుండం కమిషనరేట్ పరిధిలో హెడ్ కానిస్టేబుళ్లుగా ప్రమోషన్ పొంది జిల్లాకు వచ్చిన ఆరుగురు ఎస్సీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సీ మాట్లాడుతూ పోలీసులు విధి నిర్వహణలో ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ ప్రజలకు సేవలు అందించాలని సూచించారు.

16న వేలం

ఆసిఫాబాద్ టౌన్, ఏప్రిల్ 11 : జిల్లా కేంద్రంలోని జిల్లా సబ్ జైలులో ఉన్న పాత ఇనుప, స్టీల్ సామగ్రికి బహిరంగ వేలం వేస్తున్నట్లు జైలు పర్యవేక్షణాధికారి ప్రేమ్ కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల వారు ఈ నెల 16న ఉదయం 11 గంటలకు రూ.500 చెల్లించి వేలంలో పాల్గొనాలని, మరిన్ని వివరాలకు 8179864066లో సంప్రదించాలని కోరారు.

ఎస్సీ డీవీ శ్రీనివాసరావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న హెడ్ కానిస్టేబుళ్లు

మంచిర్యాల జిల్లా తాండూర్‌లో పట్టుబడిన నకిలీ పత్తి విత్తనాలు(ఫైల్)

పత్తి రైతుపై నకిలీ కత్తి

- సీజన్‌కు ముందే పల్లెలకు సరఫరా
- దళారులే సూత్రధారులు..
- రైతుల అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని సొమ్ము చేసుకుంటున్న వైనం
- రంగంలోకి అధికార పార్టీ లీడర్లు సైతం
- ఇప్పటికే పలుచోట్ల నకిలీ పత్తివిత్తనాలు పట్టివేత
- అధికారుల అండదండలు.. అదుపుచేయడంలో విఫలం

ఉమ్మడి జిల్లాలో జోరుగా గ్లైసిల్ విత్తనాల దందా

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పత్తి రైతుపైకి 'నకిలీ' కత్తి దూసుకొస్తున్నది. సీజన్‌కంటే ముందే గ్లైసిల్ పత్తి విత్తనాల దందా జోరుగా సాగుతున్నది. దళారులు పలు ప్రాంతాల నుంచి తీసుకొచ్చి అమాయక రైతులకు అంటగడుతూ అందినకాడికి దండుకుంటుండగా, యంత్రాంగం చూసీచూడనట్లు వ్యవహరించడం ఆందోళన కలిగిస్తున్నది.

మంచిర్యాల జిల్లా తాండూర్‌లో పట్టుబడిన నకిలీ పత్తి విత్తనాలు(ఫైల్)

మంచిర్యాల, ఏప్రిల్ 11 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మంచిర్యాల జిల్లా తాండూర్‌తో పాటు కన్నెపల్లి, భీమిని, నెన్నెల, చెన్నూర్ రూరల్, జన్నారం, దండేపల్లి, లక్షెట్టిపేటతో పాటు ఆసిఫాబాద్ జిల్లాలోని దహెగాం, కాగజ్‌నగర్, చింతలమానేపల్లి, సిర్పూర్, బెజ్జూర్ మండలాలకు గ్లైసిల్ పత్తి విత్తనాలు సరఫరా అయ్యాయి. ఇటీవల ఆసిఫాబాద్ జిల్లా చింతలమానేపల్లి మండలంలో ఇటీవల రూ.10.50 లక్షల విలువైన మూడు క్వింటాళ్లు, మార్చి నెలాఖరున మంచిర్యాల జిల్లా తాండూర్‌లో రూ.6.17 లక్షలు విలువైన 247 కిలోల పత్తి విత్తనాలు పట్టుబడ్డాయి. అంతకుముందు కర్ణాటక నుంచి మంచిర్యాలకు డీసీఎంలో తీసుకొస్తున్న 37.5 క్వింటాళ్ల పత్తి విత్తనాలను శామీర్‌పేట్ ఓఆర్ఆర్ సమీపంలో స్వాధీనం చేసుకోగా, దందా ఏ మేరకు సాగుతున్నదో అర్థమవుతున్నది.

దళారులే సూత్రధారులు..

రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. ముఖ్యంగా భీమిని, కన్నెపల్లి, బెల్లంపల్లి, చెన్నూర్, కాగజ్‌నగర్ ప్రాంతాలకు ఏపీ నుంచి వలసవచ్చే దళారులు స్థానికంగా ఉంటూ రైతులతో పరిచయాలు పెంచుకుంటున్నారు. ఇక్కడ భూమిని కౌలు చేయడమో లేదా తోటలు లీజ్ తీసుకోవడమో చేసి రైతులను ఆకర్షిస్తున్నారు. పత్తులు విత్తే సమయానికి విత్తనాలు తీసుకురావడం కష్టమని, ముందుగానే ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలల్లోనే గ్రామీణ ప్రాంతాలను వాటిని తరలిస్తున్నారు. ఈ క్రమంలో పట్టుబడే విత్తనాలు కొద్ది మొత్తంలో ఉంటే, గుట్టుచప్పుడు కాకుండా గమ్యం చేరుతున్న విత్తనాలు పెద్ద మొత్తంలో ఉంటున్నాయి. మహారాష్ట్ర సరిహద్దులో ఉండే మండలాల్లో ఇప్పటికే గ్లైసిల్ విత్తనాలను డంప్‌ల కొద్ది స్టోర్ చేసినట్లు తెలుస్తున్నది. బెల్లంపల్లిలోని ఓ వ్యాపారి ఈ గ్లైసిల్ విత్తనాలు అమ్ముతున్నాడు. ఆయనే భీమిని, నెన్నల, దహెగాం తదితర ప్రాంతాల్లోని చిన్న వ్యాపారులకు వీటిని పంపిస్తున్నాడు. తాండూరు మండలంలో సైతం ఓ వ్యాపారి ఈ గ్లైసిల్ విత్తనాల వ్యాపారం చేస్తున్నారు. ఆంధ్రా ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి సైతం మంచిర్యాల జిల్లాలోని కొన్ని మండలాల్లో ఈ దందా చేస్తున్నారు. గతంలో ఈ వ్యవహారంలో దొరికినా ఆయన మళ్లీ అవే విత్తనాలు అమ్ముతున్నారు. ఆసిఫాబాద్ జిల్లాలో పని చేస్తున్న ఓ ప్రభుత్వ టీచర్ గతంలో మంచిర్యాలలో పని చేశారు. ఆయన తన పరిచయాలను ఉపయోగించి నకిలీ విత్తనాల రాకెట్‌ను నడిపిస్తున్నట్లు తెలిసింది. గతంలో ఓ సారి పీడీ యాక్ట్ కేసు నమోదైనప్పటికీ ఈ సారి ఆయన వెనక్కి తగ్గడం లేదని సమాచారం.

రంగంలోకి అధికార పార్టీ లీడర్లు..

గ్లైసిల్ పత్తి విత్తనాల దందాను అధికార పార్టీ లీడర్లు అద్భుతంగా వాడుకుంటున్నారు. లక్షెట్టిపేట మండలంలో ఓ గ్రామ మాజీ సర్పంచ్‌గా చేసిన వ్యక్తి లక్షెట్టిపేట, దండేపల్లి మండలాల్లోని అన్ని గ్రామాలకు నకిలీ పత్తి విత్తనాలు సరఫరా చేస్తున్నారు. మందమర్రిలో అధికార పార్టీ నాయకుడు జిల్లాలో దందాకు కేంద్ర బిందువుగా వ్యవహరిస్తున్నారు. మిగిలిన మండలాల్లోని అధికార పార్టీ నాయకులు పత్తి విత్తనాల దందాలో దూసుకుపోతున్నారు. విత్తనాలు వస్తున్నాయంటే ముందే పోలీసు శాఖ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులకు మామూళ్లు వెళ్లిపోతున్నాయన్న ఆరోపణలున్నాయి. మండలం, అక్కడ ఉన్న వ్యవసాయ భూముల లెక్కల ఆధారంగా అధికారులకు డబ్బులు అప్పగిస్తున్నట్లు తెలుస్తున్నది. గతేడాది రూ.80వేలు ఇచ్చారని ఈ సారి ఎక్కువ మొత్తం వస్తుందంటూ వ్యవసాయ శాఖలో పని చేసే ఓ అధికారి ఆయన సన్నిహితుల దగ్గర చెప్పుకొచ్చారు. విత్తనాల దందా కాసులు కురిపిస్తుండడంతో అధికారులు సైతం మిన్నకుండిపోతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. భీమిని మండలంలో ఉండే ఆంధ్రా ప్రాంతానికి చెందిన దళారుల సాయంతో గతేడాది గ్లైసిల్ విత్తనాల దందా చేసిన ఓ లీడర్ ఈ సారి తన హవాను కొనసాగిస్తున్నారు. అధికార పార్టీ లీడర్లు అన్నింటికీ ముందు పడుతుండడంతో నకిలీ దందా మూడు పూలు.. ఆరు కాయలుగా సాగుతున్నది. మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి చేతులు మారుతూ నకిలీ పత్తి విత్తనాలు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోకి వస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు నకిలీ విత్తనాలను అరికట్టే దిశగా కఠిన చర్యలు తీసుకుంటారా లేదా అన్నది వేచి చూడాల్సి ఉన్నది.

అదుపుచేయడంలో విఫలం

అంతకుముందు ఏడాది దాదాపు 60 శాతం మంది రైతులు గ్లైసిల్ విత్తనాలతో సాగు చేశారు. సాధారణంగా ప్రభుత్వ ఆమోదిత పత్తి విత్తనాలైతే కలుపు ఎక్కువగా ఉంటుంది. అదే గ్లైసిల్ పత్తి విత్తనాలైతే గడ్డి పెరగదు. కలుపు కష్టం లేకుండానే మంచి దిగుబడి వస్తుందని రైతులు వీటిపైపు మొగ్గు చూపుతున్నారు. గ్లైసిల్ విత్తనాలు పర్యావరణానికి హానికరం. వాటిని వేస్తే నేల నిస్సారం అవుతుంది. దీర్ఘకాలంలో అది భూమిపై ప్రభావం చూపిస్తుంది. ఈ విషయాలన్నీ రైతులకు వివరించడంలో అధికారులు విఫలమవుతున్నారు. దీంతో గడిచిన ఐదేళ్లుగా నకిలీ విత్తనాల సమస్య పెరిగిపోతూనే ఉంది. యేటా కోట్ల రూపాయలు చేతులు మారే ఈ నిషేధిత గ్లైసిల్ పత్తి విత్తనాల రాకెట్‌ను అదుపుచేయడంలో అధికారులు ఘోరంగా విఫలం అవుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

బెల్లంపల్లిలో పోలీస్ సిబ్బందితో మాట్లాడుతున్న రామగుండం సీపీ అంబర్ కిశోర్ ఝూ

ప్రజాఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

● సీపీ అంబర్ కిశోర్ ఝూ ● బెల్లంపల్లి, మాదారం పోలీస్‌స్టేషన్‌ల తనిఖీ

బెల్లంపల్లి, ఏప్రిల్ 11 : ప్రజా ఫిర్యాదులపై తక్షణమై స్పందించాలని రామగుండం సీపీ అంబర్ కిశోర్ ఝూ పోలీసులను ఆదేశించారు. శుక్రవారం పట్టణంలోని టూ టౌన్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరిసరాలను పరిశీలించారు. సిబ్బంది సమస్యలు అడిగి తెలుసుకున్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని పోలీసులకు సూచించారు. ఆయన వెంట మంచిర్యాల డీసీపీ భాస్కర్, బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, బెల్లంపల్లి రూ రల్, తాండూర్ సీఐలు అప్జలుద్దీన్, కుమారస్వామి, టూటౌన్ ఎస్ఐ మహేందర్ ఉన్నారు.

నమ్మకం కలిగించాలి

తాండూర్, ఏప్రిల్ 11: ప్రజలకు నమ్మకం కలిగించేలా విధులు నిర్వర్తించాలని సీపీ అంబర్ కిశోర్ ఝూ పేర్కొన్నారు. శుక్రవారం మాదారం పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిసెప్షన్ సెంటర్, రికార్డులను పరిశీలించారు. ఫిర్యాదులపై విచారణ చేపట్టి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. కేసుల గురించి తాండూర్ సర్కిల్ సీఐ కుమారస్వామిని అడిగి తెలుసుకున్నారు. నకిలీ పత్తి విత్తనాలు, ఇసుక అక్రమ రవాణా, అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. గిరిజనులతో మమేకమై ఫ్రెండ్లీ పోలీసింగ్ ద్వారా సామాజిక కార్యక్రమాలు చేపట్టాలన్నారు. మాదారం ఎస్ఐ సౌజన్య, పోలీసులు ఉన్నారు.

ఎల్లంపల్లి ప్రాజెక్టులో వాటర్ డాగ్స్

మంచిర్యాల జిల్లాలోని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్ట్‌లో అరుదైన నీటికుక్కలు (వాటర్ డాగ్స్) శుక్రవారం కనిపించాయి. నీటిలో తిరుగుతూ చేపలను ఆహారంగా తీసుకునే వీటిని లూట్రా శాస్త్రీయనామంతో పిలుస్తారు. అరుదైన ఈ క్షీరదాలు అంతరించిపోతున్న జాబితాలో ఉన్నట్లు పర్యావరణవేత్తలు చెబుతున్నారు. గోదావరి, ప్రాణహిత నదీ తీర ప్రాంతాల్లో ఈ వాటర్ డాగ్స్ సంఖ్య పెరుగుతున్నట్లు వారు తెలిపారు. ఎల్లంపల్లిలో ఈ నీటి కుక్కలు కనిపించడం ఇదే తొలిసారి. వీటిని సంరక్షించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. - స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, మంచిర్యాల

శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నీటిలో నీటి కుక్కలు

ఎల్లంపల్లి ప్రాజెక్టు నీటి మధ్యలో మట్టి గడ్డపై సంచరిస్తున్న నీటి కుక్కలు